

కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



నర్సంపేట రూరల్ : పట్టణంలో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు


# ఎక్కడికక్కడ నిర్బంధం

## నిరుద్యోగుల కోసం యువ గర్జన

- అర్ధరాత్రి నుంచే మొదలైన విద్యార్థి నేతల అరెస్టుల పర్వం
- టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్లకుండా ఖాకీల అడ్డగింత
- ముందస్తుగా అదుపులోకి పార్టీలు, బీఆర్ఎస్వీ, బీజేవైఎం నాయకులు
- ములుగులో ఉద్రిక్తంగా కలెక్టరేట్ ముట్టడి
- ఠాణాల్లో నిరసన తెలిపిన నాయకులు
- అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్న నేతలు
- జీవో 317, 46ను తీసివేయాలని డిమాండ్
- సర్కారు నియంత్రృత్వంపై భగ్గుమన్న వైనం

*నిరుద్యోగుల సమస్యలపై విద్యార్థి నేతలు కదంతొక్కగా అడుగడుగునా నిర్బంధం కొనసాగింది. న్యాయమైన డిమాండ్ల కోసం హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ ముట్టడికి సిద్ధమైన బీఆర్ఎస్వీ, బీజేవైఎం, ఏబీవీపీ సహా ఇతర విద్యార్థి సంఘాల నేతలపై గురువారం అర్ధరాత్రి నుంచే 'సర్కారు నియంతృత్వం' మొదలైంది. శుక్రవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టుల పర్వం మొదలుకాగా ఠాణాల్లోనూ నిరసన కొనసాగింది. అలాగే ములుగు కలెక్టరేట్ ముట్టడితో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో బీజేవైఎం నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్లు వేసేవరకూ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన రేవంత్‌రెడ్డి సర్కారు.. నిర్బంధాలతో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను తీసుకొచ్చి హక్కులను కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల పక్షాన కొట్లాడుతున్న వారిని అరెస్టుల పేరుతో అడ్డుకోవడం అప్రజాస్వామికమని, ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధమేనని వారు తెగేసి చెప్పారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 5*




ములుగులోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు



ములుగులో బీజేపీ, బీజేవైఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

### మానుకోట జిల్లాలో 26 మంది అరెస్ట్

మహబూబాబాద్, జూలై 5(నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్తున్న యువతను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి మహబూబాబాద్ జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, రోడ్డు మార్గాన చెక్‌పోస్టుల వద్ద మొత్తం 26మంది యువకులను అరెస్టు చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ధర్నా చేసేందుకు వెళ్తున్న వారిని అడ్డుకోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది.

### ములుగు కలెక్టరేట్ ముట్టడి

ములుగురూరల్, జూలై 5 : నిరుద్యోగుల సమస్యలపై ములుగు కలెక్టరేట్‌ను బీజేపీ, బీజేవైఎం నాయకులు శుక్రవారం ముట్టడించారు. కార్యాలయం ఎదుట ప్లకార్డులతో బైఠాయించి ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై-2 రామకృష్ణ అక్కడకు చేరుకొని వారిని అరెస్ట్ చేసి అనంతరం వదిలివేశారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. మంత్రి సీతక్క స్పందించి జీవో నంబర్ 317, 46ను రద్దుచేసి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మండలాధ్యక్షుడు గాదం కుమార్, బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్, పాలసీ, రీసెర్చ్ కన్వీనర్ రాజునాయక్ పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్ ను ముట్టడించిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.





టేకుమట్ల : ముందస్తు అరెస్టు అయిన నాయకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, బీజేవైఎం, ఏబీవీపీ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు. పథకం ప్రకారం గురువారం అర్ధరాత్రి ఇళ్లల్లోకి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారేసరికి పోలీస్ స్టేషన్లకు తరలించారు. మధ్యాహ్నం వరకు సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 317, 46ను తీసివేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్లు వేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా జాబ్ క్యాలెండర్ రూపొందించలేదన్నారు.

నిరుద్యోగులు తమ సమస్యల సాధన కోసం శుక్రవారం టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి పిలుపుచిచ్చిన నేపథ్యంలో దానిని భగ్నం చేసేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి దాటాక పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకుల ఇండ్లలోకి వెళ్లి ముందస్తు అరెస్టులు చేశారు. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాలలో బీజేపీ ప్రాంత సమితి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శశితో పాటు మరో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

అలాగే గణపురం మండలంలో బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేశ్, మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, నాయకులు భాస్కర్, రజాక్‌ను అరెస్ట్ చేశారు. మహాదేవపూర్‌లో ఏవీబీపీ నాయకులు గోగుల కృష్ణ, పేట సాయి, బీజేపీ మండలాధ్యక్షుడు ఆకుల శ్రీధర్, నాయకులు అడప లక్ష్మీనారాయణ, కొక్కు శ్రీనివాస్, కాళేశ్వరం పరిధిలో బీఆర్ఎస్ నాయకులు ఓగేశ్, రమేశ్, లేతకరి రవి, చంద్రయ్య, మహేశ్, బీజేపీ నాయకులు గోర శ్రీకాంత్, దేవయ్య, బొల్లం కిషన్, కాటారంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు సంతోశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్, మల్హర్‌లో బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్, మరో ఇద్దరు, టేకుమట్లలో మాట్ల వెంకటేశ్ (బీఆర్ఎస్), బూస నాగరాజు (బీజేపీ), నూనేటి అరుణ్, సిద్దు, చిలుక మహేందర్(బీజేవైఎం),రేగొండలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఓరుగంటి భగవాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ములుగు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్‌కు చెందిన కోగిల మహేశ్, పోరిక రాహుల్‌నాయక్, బీజైవైఎం నాయకులు నగరపు రమేశ్, రాయంచు నాగరాజు, కత్తి హరీశ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అలాగే తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్, మేడారంలో బీజేవైఎం నాయకులను నిర్బంధించారు. వెంకటాపూర్ మండలంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు అంతటి రాము, ముడిగే రాజకుమార్‌ను అరెస్ట్ చేశారు. అలాగే జనగామ జిల్లా బచ్చన్నపేట బీజేవైఎం మండలాధ్యక్షుడు బంగారు మహేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కక్కర్ల గణేశ్, నాయకులు కంటెం భాస్కర్, రాంబాబు, కిషన్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు దేవోజు హేమంత్, బీఆర్ఎస్ యూత్ నాయకుడు బొల్లపెల్లి కమల్‌తో పాటు మరికొంత మందిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఖానాపురం మండలంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బూడిద ముఖేశ్‌కుమార్, బీజేవైఎం మండలాధ్యక్షుడు ఆకుల హేమంత్, ఎఫ్ఎఫ్ఐ జిల్లా నాయకుడు యార ప్రశాంత్‌ను అరెస్ట్ చేశారు. అలాగే వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసులు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు, పుప్పాల శ్రీనివాస్, చింతల అనిల్, మండల భూపాల్, గొర్రె కోటి, వేల్పుల నందు, ఇనుముల రాజును అదుపులోకి తీసుకున్నారు. హనుమకొండ, సుబేదారి, కాకతీయ యూనివర్సిటీ పోలీసులు 20 మందికిపైగా యువకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.



ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు, దివ్యాంగులు, వృద్ధులు


# పింఛన్ పెంచి ఇవ్వాలి

**జనగామ, ములుగు కలెక్టరేట్ల వద్ద దివ్యాంగులు, వృద్ధుల ధర్నా**

జనగామ, జూలై 5 (నమస్తే తెలంగాణ)/ ములుగు రూరల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెంచి ఇస్తామన్న పింఛన్ వెంటనే అమలుచేయాలంటూ దివ్యాంగులు, వృద్ధులు రోడ్డెక్కారు. ఈమేరకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ములుగు, జనగామ కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. జనగామలో వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం సోమరాజు, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి కుమార్, ములుగులో జిల్లా అధ్యక్షుడు మంచోజు చంద్రమౌళి ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ఆందోళన నిర్వహించారు. దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత కార్మికులకు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, 2016 చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలన్నారు. ములుగులో ధర్నాకు ఎమ్మార్పీఎస్ నాయకులు నెమలి నర్సయ్య, శ్యాంబాబు, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ ముద్దతు తెలిపారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. జనగామలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందేన రవీందర్, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు నగేశ్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, చక్రపాణి, సిద్ధారెడ్డి, స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో నైట్ పెట్రోలింగ్

- సీపీ అంబర్‌కిశోర్ ఝా ఆకస్మిక తనిఖీలు



కాజీపేట రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

సుబేదారి/గిర్మాజీపేట, జూలై 5 : నగరంలో నైట్ పెట్రోలింగ్ మొదలైంది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోకిరీలు, నేరస్తుల ఆటకట్టించేందుకు పోలీస్ బాస్ రంగంలోకి దిగారు. ఈమేరకు వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని పోచమ్మమైదాన్, మండి బజార్, హనుమకొండ, కాజీపేట రైల్వేస్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇక నుంచి ముమ్మరంగా పోలీస్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీలుంటాయని ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని సీపీ హెచ్చరించారు. ఆయన వెంట వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఉన్నారు.



భూపాలపల్లి రూరల్ : ర్యాలీ తీస్తున్న వామపక్షాల నాయకులు




హనుమకొండ : కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

# బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాల్సిందే

- వామపక్ష కార్మిక సంఘాల డిమాండ్

హనుమకొండ/భూపాలపల్లి రూరల్/ఖిలావరంగల్, జూలై 5 : బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే రద్దుచేసి, సింగరేణికే నేరుగా అప్పగించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ పార్టీ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పీ స్కైలాబ్ బాబు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు గనులను కేంద్రం వేలం వేస్తున్నదని, దీంతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలం ప్రక్రియను ప్రారంభించడం దారుణమన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా నేతలు టీ ఉప్పలయ్య, వీరన్న, రాములు, సంపత్, లింగయ్య, భానునాయక్, సీపీఐ జిల్లా నేతలు శ్రీనివాస్, సదాలక్ష్మి, లక్ష్మణ్, భిక్షపతి, రవి, ఎంసీపీఐయూ జిల్లా నేతలు నాగార్జున, సావిత్రి, శ్రీనివాసరావు, మొగిలి, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి ఎన్ హంసారెడ్డి, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి గౌడగాని శివాజీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జీ దయాకర్ పాల్గొన్నారు. అలాగే, భూపాలపల్లిలోని గణేశ్ చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ సింగరేణి జోలికి వస్తే సహించేది లేదని, వెంటనే వేలాన్ని రద్దు చేసి, గనులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్, జీ శ్రీనివాస్, విజేందర్, క్యాతరాజు సతీశ్, రామ్ చందర్, ఆసిఫ్ పాషా, వెలిశెట్టి రాజయ్య, ఆత్కూరి శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు గని వేలాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఏవోకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, బాబు, రాచర్ల బాలరాజు, గన్నారపు రమేశ్, దామోదర కృష్ణ, ఎండీ యాకూబ్ పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

- సర్టిఫికెట్ల ధ్రువీకరణకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు
- ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్

హనుమకొండ చౌరస్తా, జూలై 5 : ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి శనివారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నదని, సర్టిఫికెట్ల ధ్రువీకరణ కోసం నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 13 వరకు వరంగల్ పాలిటెక్నిక్ కాలేజీ, 8వ తేదీ వరకు కాకతీయ డిగ్రీ కళాశాల, 11వ తేదీ వరకు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, 10వ తేదీ వరకు వరకు కేయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యల నివృత్తికి వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. క్వాలిఫై అయిన విద్యార్థులు ఈ నెల 12 వరకు సర్టిఫికెట్స్ ధ్రువీకరణ స్లాట్స్ ఎంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు తాము కోరుకున్న బీటెక్, బీఫార్మసీ ప్రోగ్రామ్స్‌ను ఎంచుకొని tgeapcet.nic.inలో ఈ నెల 8 నుంచి 15 వరకు ఆప్షన్ ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. వారికి 19న సీట్ కేటాయించనున్నట్లు తెలిపారు. సీట్ పొందిన విద్యార్థులు 19 నుంచి 23 వరకు వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ రుసుం చెల్లించి, సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్స్ ధ్రువీకరణకు హాజరయ్యే విద్యార్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ మెమోలు, 6 నుంచి 12వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, 2024-25కు సంబంధించి ఆదాయం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, కులం తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక కాపీ జిరాక్స్ సెట్ కూడా తీసుకుని రావాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల మొబైల్ నెంబర్‌ను మాత్రమే సర్టిఫికెట్స్ ధ్రువీకరణ సమయంలో నమోదు చేయాలని, దానికి మాత్రమే లాగిన్ ఐడీ పంపనున్నట్లు తెలిపారు. ఇతర వ్యక్తుల నంబర్‌ను వాడరాదని, పాస్‌వర్డ్‌ను ఎక్కడా రాయకుండా చూసుకోవాలని సూచించారు.

# కొత్త చట్టాలు అమలు చేయొద్దు

**కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా**

వరంగల్ లీగల్, జూలై 5 : పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కొత్త చట్టాలను వెంటనే నిలిపివేయాలని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో హనుమకొండలోని కోర్టు ఎదుట విధులను బహిష్కరించి, నిరసన తెలిపారు. ప్రతిపక్షాల నోరు నొక్కి ఏకపక్షంగా చట్టాలను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. దీని వల్ల ప్రజాస్వామ్యం మనుగడే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా చట్టాల అమలు నిలిపివేయకుంటే దేశవ్యాప్త నిరసనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి ఉంటుందని జీవన్‌గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ అసోసియేషన్ల ప్రధాన కార్యదర్శులు ముదస్సిర్ అహ్మద్, లాడే రమేశ్, సీనియర్ ఈసీ మెంబర్ సాంబశివరావు, అంబరీశ్‌రావు, అఖిల్ పాషా, గంధం శివ పాల్గొన్నారు.




హనుమకొండ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

# జనగామ బస్టాండ్‌లో కరెంట్ కట్



*జనగామ, జూలై 5 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి కరెంటు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ చౌరస్తా నుంచి దేవీ థియేటర్ వరకు రాత్రి 8 నుంచి దాదాపు అర గంట పాటు కరెంట్ సరఫరా లేక పోవడంతో ప్రయాణికులు చిమ్మచీకట్లో కూర్చొని బస్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.*

# కారు, ఆటోఢీ

## ముగ్గురి దుర్మరణం

- దంతాలపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు



బంధు మల్లేశం, కొమురయ్య, నరేశ్

దంతాలపల్లి, జూలై 5 : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, ఆటో ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాతపడగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దంతాలపల్లి మండలకేంద్రం శివారు చారితండా ఎక్స్‌రోడ్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. తొర్రూరు నుంచి మరిపెడకు వెళ్లే ఆటోలో తమ ఇంటికి వెళ్లేందుకు బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పగిండ్ల కొమురయ్య, అతడి భార్య మంజుల, కూతురు అంజలి, నెల్లికుదురు మండలం అమనగల్‌కు చెందిన అక్కనపల్లి అక్షయ, వాల్యాతండాకు చెందిన భూక్యా నరేశ్ ఎక్కారు. దంతాలపల్లి గ్రామ శివారులో ఆటో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో ఖమ్మం నుంచి దంతాలపల్లికి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తొర్రూరు మండలం వెలికట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బంధు మల్లేశం (40), బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన కొమురయ్య (38), వాల్యాతండాకు చెందిన నరేశ్ (28) అక్కడికక్కడే మృతి చెందారు. మంజుల, అంజలి, అక్షయకు తీవ్రగాయాలు కాగా వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.